# స్కౌండ్రల్

'ఫట్' మంటూ రాయొచ్చి కాళ్ళ దగ్గర పడింది.

ఉలిక్కి పడింది సరోజ.

ఆ రాయికి మామూలుగా ఒక కాగితం చుట్టి వున్నది. చటుక్కున తలెత్తి కిటికీలోనుంచి పక్క యింట్లోకి చూచింది. ఆ స్కౌండ్రల్ అక్కడే వున్నాడు.

విసురుగా లేచి కిటికీ తలుపులు విరిగేలా మూసింది.

'ఛీ! ఛీ!... మనిషి కాదు... వాడూ– వాడి హిప్పీ జుట్టు, సైడ్ లాక్స్, గొట్టం ప్యాంటు... రౌడీ వెధవ!'

చికాగ్గా లేచి నిలబడింది. ఎదురుగ్గా నిలువుటద్దం తనని పరీక్షిస్తున్నట్లే వున్నది. తన ముఖంలోని చికాకును తనకు చూపిస్తోంది.

గాలికెగురుతున్న జుట్టు కళ్ళ మీదకు పడుతోంది. ఓరగా ఒక పక్కగా పెట్టుకున్న గులాబీ తనలోని అందాన్ని ద్విగుణీకృతం చేస్తున్నది. ఐటెక్స్ అసలే పెద్దవైన కళ్ళను మరింత పెద్దవి చేస్తున్నది. ఆకుపచ్చ బొట్టు అందంగా మెరిసి పోతోంది.

తన అందం చూచి తనకే గర్వం వేస్తోంది. నిజమే–ఆ పక్షీంద్రుడు తనంటే పడి చావటంలో అసహజమేమీ లేదు.

కానీ ఇదే గనుక కాలేజీ అయివున్నట్లయితే తన ఎడం కాలి చెప్పు తెగి వుండేది. వాడి పళ్ళు ఊడి ఉండేవి.

రాతికి చుట్టివున్న కాగితాన్ని నిర్లక్ష్యంగా విప్పింది.

"ప్రేయసీ, ఇదే నీకు నా అంజలి... నీ దయ నా మీద ఎన్నడు? నీ కోసం తపించే నీ వాడు!"

"స్కౌండ్రల్!" కళ్ళు ఎరుపెక్కగా మరోసారి కసిగా తిట్టుకున్నది.

ఇదెక్కడి పీడ తనకు?

ఈ రోజయినా గట్టిగా చెప్పాలి ఆయనకు- ఈ యిల్లు ఎంత త్వరగా మారితే అంత మంచిది. ఇక ఒక్క క్షణం ఈ యింట్లో ఉండగూడదు... వెధవ చికాకు...

తలుపు తట్టిన శబ్దమయింది.

'శ్రీవారు వచ్చినట్లున్నారు!' అనుకుంటూ వడివడిగా వాకిట్లోకి వచ్చి తలుపు తీసింది.

ఆయనే!- తలుపు తెరవగానే శ్రీరామచంద్రుడిలా చిరునవ్వుతో కనబడ్డారు.

"యస్ ప్లీజ్!" ఒక్క అడుగు వెనక్కు వేసింది ఆహ్వానసూచకంగా సరోజ.

"థాంక్యూ!" లోపలికి వచ్చాడు సరోజ భర్త సుందరమూర్తి.

తలుపు దగ్గరకు వేసి, గడియ బిగించి, ఆమె నడుంచుట్టూ చేయివేసి నడిపించసాగాడు.

"వదలండి మాష్టారూ! నలుగురూ చూస్తే నవ్విపోయేను!"

"ఎవ్వరు నవ్వితే వాళ్ళ పళ్ళే బయిటపడేను... మనకేల!"

"ఒన్ మినిట్... మీకిష్టమైన మైసూర్‌పాక్ చేశాను!"

"అయితే త్వరగా మేడం...!" నడుం చుట్టూ చేయి వదలటం... ఆవిడగారు తుర్రుమంటూ, వెక్కిరిస్తూ లోపలకు పోవడం ఒక్కసారే జరిగినయి.

తరువాత ఐదు నిముషాలకు కాఫీ చేతికందిస్తూ, "వెంటనే వెళ్ళి మరో ఇల్లు చూడండి... ఎన్నిసార్లు చెప్పించు కుంటారు నాచేత!" అన్నది కినుక నటిస్తూ సరోజ.

"నేను చూడను... కారణం ఏమిటో చెప్పందే నాకు చూడాల్సిన అవసరం లేదు... ఇంత చక్కటి కొంప ఈ హైద్రాబాద్ మొత్తం మీద ఎక్కడ దొరుకుతుందో చెప్పు... ఇంత చక్కటి గాలి చికాకు కలిగిస్తోందా?... ఇంత అందమైన ఆవరణ అంత అందహీనంగా కనిపిస్తున్నదా?... చక్కటి పూలచెట్లన్నీ వెగటేస్తున్నయ్యా?... గదుల్లో ఇంత వెలుతురు కళ్ళకు కంటకంగా వున్నదా?"

"ఉఁహూఁ... అవేంకాదు!" మురిపెంగా భర్త ముఖంలోకి చూచింది.

"మరేమిటి?"

"ఈ వాతావరణం నాకు నచ్చటం లేదు!"

"ఏమైంది ఈ వాతావరణానికి...?" నుదురు చిట్లించి కాస్త విసుక్కుంటున్నట్లుగా అన్నాడు.

అసలు సంగతి చెప్పేద్దామా అన్నట్లుగా నాలిక చివరిదాకా మాటలు వచ్చినయి. ఆ మాట వింటూనే ఈయనా ఆ స్కౌండ్రల్ కొట్టుకోరు గదా! అసలే వాడివి ఇనుప ఊచల చేతులు...

"కారణం ఏదీ లేదండీ... ఒకటే బోర్ నాకు... ఎక్కడన్నా పదిమంది వున్న యింట్లో చిన్న భాగం అద్దెకు తీసుకోండి... ఇలా ఇండిపెండెంట్ హౌస్ వద్దు!"

"ఇంట్లో అంత సంచు ఎందుకు... హాయిగా వంటరిగా బ్రతక్క... అంతగా తోచకపోతే పక్కనున్న ఇళ్ళల్లో మనుష్యులు లేరా? వాళ్ళు నీతో మాట్లాడరా?"

"ఉఁహూఁ...!" అన్నది కళ్ళు సగం మూసుకుంటూ. "వాళ్ళంటే నాకు చచ్చే భయం!"

"ఏం?"

"వాళ్ళు బాగా డబ్బున్న వాళ్ళు... మనమా అటూయిటూ కాని మధ్యరకం వాళ్ళం!"

"– అంటే యిన్ఫీరియారిటీ కాంప్లెక్స్ అన్నమాట!" సుందరమూర్తి ఫక్కున నవ్వాడు లేచి నిల్చుంటూ.

"మీరేమైనా అనండి... నాకీ యింట్లో ఉండటం యిష్టంలేదు!" ఆ స్కౌండ్రల్ గుర్తుకు వస్తుంటే సగం శరీరం సిగ్గుతో చచ్చిపోతోంది.

"నాకీ యింట్లో వుండటమే ఇష్టం...!" అంటూ ఆమె బుగ్గమీద చిటికవేసి, "మేడమ్... త్వరగా కానీయ్... రామ్మూర్తి స్కూటర్ తెస్తాను... 'కోడెనాగు' కు వెళ్దాం!" అంటూనే పక్క గదిలోకి వెళ్ళాడు.

చేతిలో వున్న పుస్తకాన్ని నేల మీద విసురుగా కొట్టింది సరోజ. 'ఛీ! ఏం మనిషి... ఎలా చెప్పాలి ఈయనకు... ఎలా చెబితే అర్థమవుతుంది?'

బాత్‌రూం తలుపు తీసింది ముఖం కడుక్కునేందుకు.

"నగుమోము గనలేని..." పక్కయింట్లో ఆ స్కౌండ్రల్ చెల్లెలు పాడుతోంది.

ఎంత చక్కగా పాడుతుంది ఆ అమ్మాయి?...

ఆ అన్నకు తగిన చెల్లెలే కాదు... ముచ్చటగా, కుదురుగా వుంటుంది... ఆ కంఠం వీణ మీటినట్లే వుంటుంది... ఆ అమ్మాయి పాట వింటుంటే అమృతాన్ని సేవిస్తున్నట్లే వుంటుంది- ఒక్క చేతివేళ్ళే సమంగా వుందనప్పుడు ఒక తల్లి పిల్లలు ఒకటిగా వుండాలని మాత్రం ఎక్కడున్నది?

ముఖం కడుక్కున్నది సరోజ.

మళ్ళీ ఆ రౌడీగాడు కళ్ళముందు తారట్లాడాడు.

చేతికున్న సబ్బును కడుక్కుంటున్నదల్లా ఒక్కక్షణం ఆగింది.

ఆ మొగ రాక్షసుడికి తనకూ ఒక చెల్లెలున్నదనే జ్ఞానం లేదా? తననీ ఒక చెల్లెలనే ఎందుకనుకోడు?

ఆమె ఆలోచనలు పరిపరి విధాలుగా పోసాగినయి...

ఈనాటి విద్యావిధానాన్ని, సినిమాలను- మనుష్యులను, వాళ్ళ మనస్సులను కాలుష్యం చేసే ఈ ప్రపంచాన్నీ కాసేపు తిట్టుకున్నది.

వీళ్ళు ఎప్పటికి బాగుపడేను?

భర్త పక్కన కూర్చొని సినిమా చూస్తున్నా మనస్సంతా చికాగ్గానే వున్నది.

ఇదెక్కడి పరీక్ష తనకు?

ఎలా ఈ వలయం నుంచి తను బయిటపడటం?

ఏం చేయాలి?

- ఏం చేయాలో ఎంతగా ఆలోచించినా అర్థమే కావటం లేదు!

భర్తకు చెబితేనో అసలు సంగతి- చప్పట్లు కొడితే శబ్దమవుతుంది. వాళ్ళిద్దరూ రోడ్డెక్కితే పరువు పోయేది తనదే!

సినిమాలో ఏవేవో బొమ్మలు కదలాడుతున్నాయి కాని ఒక్కటీ సరోజ మనస్సుకు ఎక్కటం లేదు... సుందరమూర్తి మధ్యలో రెండు మూడు విట్లు వేసినా అన్యమనస్కంగా నవ్వి వూరుకున్నదేగాని ఆనందించలేకపోయింది.

ఆరాత్రి ఆమె సరిగ్గా నిద్రగూడా పోలేదు!

* * *

మూడోరోజు సాయంత్రం...

ఈ ప్రపంచం మీద విసుగొందిన సూర్యుడు ఎప్పుడు పడమటి కొండల వెనక్కు పారిపోదామా అని ఆలోచిస్తున్న సమయంలో...

సుందరమూర్తి ఇంకో అరగంటకు ఇంటికి వస్తాడనగా...

సరోజ నిలువుటద్దం ముందు నిలుచొని... అద్దంలో చూచుకుంటూ తన కిష్టమయిన తెల్ల చీర కట్టుకున్నది. తెల్ల జాకెట్టు తొడుక్కున్నది. మొహానికి పౌడర్ రాసుకొని ఎర్రటి కుంకుమను బొట్టుగా పెట్టుకున్నది... పక్కనే వున్న స్టీలు పళ్ళెంలోని మల్లెమాలను తలలో పెట్టుకుంటున్న సమయంలో...

పక్కింట్లోనుంచి ఆ అమ్మాయి, "ఓరజూపు జూచేది న్యాయమా..." అంటూ పాట అందుకున్నది.

ఆ పాట గింగిరాలు తిరుగుతూ సరోజను సన్నజాజి తీగలా అల్లుకు పోయింది- ఎంత తీయని గొంతు!

అద్దంలో తనని తాను చూచుకుంటూ అందమయిన ఆ పాట వింటూ తన్మయంగా వున్న సరోజ ఉలిక్కిపడేలా కిటికీలోనుంచి 'ధన్' మంటూ ఓ ఉండ వచ్చి కాళ్ళముందు పడింది.

సరోజ గుండె దడదడలాడింది.

భయంగా తలెత్తి కిటికీలోనుంచి చూస్తే ఆ స్కౌండ్రల్ నవ్వుతూ చేయెత్తి 'టాటా' చెబుతున్నట్లుగా వేళ్ళూపుతున్నాడు.

నుదురు చిట్లించి అసహ్యంగా అతడి ముఖంలోకి ఒక్కసారి చూచి కిటికీ తలుపులు మూసివేసింది.

"స్కౌండ్రల్!"

చీకటిగా వున్న గదిలో లైటు వేసింది.

క్రింద పడిన కాగితపు ఉండను వాకిట్లో మురుగ్గుంటలోకి విసిరేయాలన్నట్లుగా చేతిలోకి తీసుకున్నది.

అందులో మల్లెపూల దండ వున్నది.

దాన్ని చుట్టిన కాగితం మీద ఇలా రాసి వున్నది.

"ప్రేయసీ, ఈ మల్లెలను అలంకరించుకొని వాటికి అందాన్ని ప్రసాదించు. తిరిగి వాటిని నాకే ప్రసాదించు- నీ ప్రియుడు."

నీరసంగా, భయంగా మంచం మీదకు వాలిపోయింది సరోజ.

అతడు రాబందులా కనబడుతున్నాడు. అతడు రాక్షసుడిలా కనబడుతున్నాడు. అతడు తన రక్తాన్ని పిండుతున్నాడు... అతడు తన ఆనందానికి, సౌభాగ్యానికీ కత్తెరే అవుతున్నాడు!

అతడు తనని చంపేస్తున్నాడు.

ఛ! ఛ!...

ఈ ఇంట్లో ఇంకొక్క క్షణం వుండగూడదు. ఈ ఇంట్లోనుంచి ఆయన మారననే అంటే తను పుట్టింటికైనా వెళ్ళిపోతుంది గాని ఇక్కడ మాత్రం వుండదు!

పెట్టుకున్న పూలను తీసివేసి చికాగ్గా విసిరి వేసింది. అలా మంచం మీద చీర ముడతలు పడుతున్నా నిర్లక్ష్యంగా, అన్యమనస్కంగా పడుకున్నది.

సరోజ కళ్ళమ్మట నీళ్ళు గిర్రున తిరిగినయి.

ఈ ప్రపంచం మీద, ప్రపంచంలోని మగవాళ్ళ మీద తెలియని కసి ఏర్పడింది. కళ్ళు ఎర్రబడినయి. పిడికిలి బిగుసుకు పోయింది.

ఒక్క ఉదుటున మంచం మీద నుంచి లేచింది.

సూట్కేసు తీసింది. తన గుడ్డలు మడతలు పెట్టి దాంట్లో పేర్చసాగింది.

అప్పుడే సుందరమూర్తి తలుపు తట్టాడు.

కోపం గుండెల్లో ఉవ్వెత్తుగా ఎగతన్నగా పెద్ద పెద్ద అంగలతో వెళ్ళి తలుపు తీసి గిరుక్కున వెనక్కు తిరిగింది.

"ఓయ్ సరోజా! సర్కస్‌కు వెళ్దామా?"

"నేను మా యింటికి వెళ్ళిపోతున్నాను!" అన్నది వెనక్కు తిరక్కుండానే.

"అదేం... ఉత్తరమేమైనా వచ్చిందా?"

"లేదు!"

"మరి?"

"మీరు యిల్లు మార్చి ఉత్తరం రాస్తేనే నేను తిరిగి వచ్చేది!"

"సరోజా! నీకేమైంది?... ఈ ఇల్లంటే నీకెందుకింత వెగటు... ఇంత చక్కటి ఇల్లు మరొకటి నీకు దొరుకుతుందనే!" అన్నాడు విసుగ్గా సరోజ భుజం మీద చేతులు వేసి తన వైపుకు తిప్పుకుంటూ.

"ఈ యింట్లో దయ్యాలున్నయ్యనీ... ఆ దయ్యాలతోనే పగలంతా నేను ఒంటరిగా పోరాడుతున్నానని మీకు తెలుసా?" అన్నది కళ్ళు నిప్పులు కురిపిస్తుండగా సరోజ.

"దయ్యాలా?"

"ఆc... మధ్యాహ్నం పూట నా గుండెల్ని పిండుతున్నాయి... నా రక్తం చూస్తేనేగాని వదిలేలా లేవు అవి నన్ను!" అన్నది కసిగా.

"సరోజా!"

"అవును... ఆ దయ్యం ఆడవాళ్ళనే పట్టుకు పీడిస్తుందల్లే వున్నది... మీరటు వెళ్ళటం... అది నా వెంట బడటం... నా గుండెలు చూడండి... గొట్లతో నెత్తురెలా చిమ్ముతున్నదో!"

"సరోజా!" ఆమె ఆవేశానికి అతడి మరింత నీరసించి పోయాడు.

"నిజమా! నిజంగా వున్నయ్యా ఈ ఇంట్లో దయ్యాలు...?"

"నిజం! కావాలంటే నా చీర కట్టుకొని రేపు పగలంతా ఈ మంచం మీద పడుకొని వుండండి!" అన్నది అంత కోపంలోనూ భయంతో బిగుసుకు పోతున్న భర్త ముఖాన్ని చూచి ఉబికి వస్తున్న నవ్వును ఆపుకుంటూ.

"సరే! అయితే నీవేం ఊరికి వెళ్ళనక్కరలేదు... మరో యిల్లు చూద్దాం!" అన్నాడు ముఖమంతా నల్లబడిపోగా, చికాగ్గా. అతనేదో స్వంత యిల్లే పోగొట్టుకున్నంత దిగులుగా, నీరసంగా.

* * *

పదిరోజుల తరువాత ఓ సాయంత్రం సరోజ ఏరికోరి పదిమంది వున్న పెద్ద లోగిలిలో అద్దెకు తీసుకున్న చిన్న భాగంలో నిలబడి– నిలువుటద్దంలో తన అందాన్నే తను చూచుకుంటూ, గర్వపడుతూ నవ్వుకుంటున్న సమయంలో...

'ఫట్' మంటూ ఓ రాయి కిటికీలోనుంచి వచ్చి లోపల పడింది.

ఆ రాతినీ, రాతికి చుట్టి వున్న కాగితాన్నీ చూస్తూనే సరోజ పైప్రాణాలు పైనే పోయినయి!

ఇంత దూరం వచ్చినా ఆ స్కౌండ్రల్ తనని వదలనే లేదు!

ఉఁహూఁ...

ఇక తాత్సారం చేసి లాభం లేదు.

రోడ్డుమీద పడి కొట్టుకుంటే కొట్టుకున్నారు, ఆయనకు చెప్పక తప్పదు...

కిటికీలోనుంచి చికాగ్గా, అసహ్యంగా రోడ్డుమీదకు చూచింది.

ఆ స్కౌండ్రల్ వెనక్కు వెనక్కు చూచుకుంటూ రోడ్డుమీద నడుస్తున్నాడు.

'ఛీ! నీచుడా... పచ్చటి సంసారంలో నిప్పులు పోస్తావా?... నీ ఆటలు ఇంకెన్నాళ్ళో సాగవులే... నీ అంతు తేల్చి కాని నేను వదలను!' అనుకున్నది కసిగా.

ఆ రాతిని చేతిలోకి తీసుకున్నది.

ఉండకు చుట్టి వున్న కాగితాన్ని విడదీసింది.

"చెల్లీ,

నన్ను క్షమించు.

నీ భర్త విషపు చూపులనుండీ, పిచ్చి పిచ్చి వేషాలనుండీ– నా చెల్లెలు నలుగురి నోళ్ళలోనూ పడకుండా బయిట పడాలంటే నాకు ఇంతకు మించిన ఉపాయం మరొకటి తోచనేలేదు.

మీరు ఇల్లు మారటమే నాకు కావాల్సింది.

అందుకే ఏ పాపమూ ఎరగని నిన్ను, నీ మనస్సును కష్టపెట్ట వలసి వచ్చింది.

మన్నించు. – నీ దృష్టిలో చెడ్డవాడినైన "నేను."

* * *

*(యువ మాసపత్రిక: జులై, 1974)*